ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబర్ 2023



జాతీయ పోటీలకు అర్హత సాధించిన పిఇటి

ప్రజాశక్తి - మక్కువ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో గరుగుబిల్లి మండలం నాగూరు జెడ్‌పిహెచ్ స్కూల్లో పిటిగా పనిచేస్తున్న మక్కువ మండలం వెంకట భైరిపురానికి చెందిన గేదెల నాగేంద్రరావు నాయుడు లాంగ్ జంప్ విభాగంలో (3.56 మీటర్స్) స్టేట్ మీట్ లో జాతీయస్థాయికి అర్హత సాధించారు. త్వరలో చత్తీష్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు ఆయన్ను పాఠశాల హెచ్‌ఎం ఈ.రాజేశ్వర రావు, స్టాఫ్ సెక్రెటరీ బి.చంద్రమౌళి, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మజ్జి. రామకృష్ణ, సెక్రెటరీ ఎం.మురళి, ఎస్‌జిఎఫ్ అధ్యక్షులు డిటి గాంధీ, జిల్లా క్రీడల సమన్వయకర్త మంతెన వాసుదేవరావు నాయుడు, పిఇటిలు, పీడీ అభినందించారు.



ముంపునకు గురైన పట్టణానికి శివారునున్న కాలనీ (ఫైల్)

పట్టణాన్ని వీడని ముప్పు

- గెడ్డలు, కాలువల ఆక్రమణలే కారణం
- నిలిచిపోతున్న వాడుక, వర్షపు నీరు
- కొరవడిన రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణాన్ని వరద ముప్పుడు వీడడం లేదు. భవిష్యత్తులో పట్టణం జలదిగ్బంధం బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పట్టణంలో గల లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారి, పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చిన్నపాటి వర్షానికే పట్టణ పరిస్థితి ఇలా ఉంటే 3,4 రోజులు కురిసే భారీ వర్షాలకు, తుఫాన్ సమయంలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని లోతట్టు, వరహాల గెడ్డ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన భారీ వర్షం పడితే వరహాల గెడ్డ పొంగి పొర్లే సందర్భాలు ఉన్నాయి. దీనివల్ల లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలమయమవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాల్లోని వ్యవసాయ భూములు నివాస ప్రాంతాలుగానూ, లేఅవుట్లుగానూ మారిపోతున్నాయి. ఈ పొలాల గుండా ఎన్నో ఏళ్లుగా ప్రవహించే సాగునీటి కాలువలను, కల్వర్టులను, మదుములను కప్పేసి లేఅవుట్లుగా మార్చేశారు. సిసి కాలువలు, రోడ్లు, పార్కులు, కల్వర్టులు వంటి సదుపాయాలను నిర్మించకుండా స్థలాలను అమ్మకాలు చేయడంతో వాటిని కొనుగోలు చేసేవారు కూడా అవేవీ పట్టించుకోకుండా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా గృహ, వాణిజ్య సముదాయాలు, అపార్ట్మెంట్ నిర్మాణాలు జరిగిపోయాయి. ఆ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నివాస గృహాల వాడుకనీరు బయటకు పోయేందుకు దారిలేకపోవడంతో పాటు, వర్షపు నీరు వెళ్లేందుకు అవకాశం ఉండడం లేదు. దీంతో ఈ ప్రాంతాలు ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయి. పట్టణానికి చెందిన నివాస గృహాల వాడుక నీరు, వర్షపు నీరు ప్రధాన రహదారి కాలువ గుండా వేణుగోపాల్ థియేటర్ వద్ద ఉన్న వరహాల గెడ్డలోకి చేరాల్సింది. అయితే ఈ వరహాలగెడ్డ ప్రధాన రహదారి గుండా బైపాస్ కాలనీ నుంచి రైల్వే పట్టాల కింద ఉన్న ఏడు ఖానాల ద్వారా వ్యవసాయ భూముల పక్క నుండి ప్రవహించి పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న రాళ్లగెడ్డ లో కలుస్తుంది. వర్షాకాలంలో పార్వతీపురం పట్టణానికి ఉన్న ఎగువ ప్రాంతంలోని, పట్టణంలోని భారీ వర్షం కురిసినప్పుడు వరహాలగెడ్డలో వరద నీరు ఎక్కువగా పోటెత్తి పొంగిన సందర్భంలో వరద నీటి ప్రవాహం చుట్టుపక్కల ఉన్న లోతట్టు ప్రాంతాలను ముంపునకు గురిచేస్తున్న సందర్భాలు కోకొల్లలు. ఇలాంటి సందర్భాల్లో స్థానిక ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, నానా ఇబ్బందులు పడే సందర్భాలు ఉన్నాయి. భవిష్యత్తులో ఈ ముంపు సమస్య మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంటుందని పట్టణవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున లక్ష్మీనారాయణ పురం నుంచి ఉన్న వరహాల గెడ్డ పరీవాహక ప్రాంతాలను వెడల్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భావిస్తున్నారు. ఈ దిశగా రెవెన్యూ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికలు ప్రణాళికలు సిద్ధం చేసి, పనులు ప్రారంభించి పట్టణాన్ని ముంపు భారీ నుండి రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరద ముప్పు తప్పేదెప్పుడో?

పార్వతీపురంరూరల్ : ఆంధ్రా-ఒడిషాల సరిహద్దు ప్రాంతాల్లో ఏమాత్రం వానలు కురిసినా వరదనీరు పార్వతీపురం పట్టణంతో పాటు, మండల ప్రజలకు కంటిమీది కునుకులేకుండా చేస్తుంది. ప్రతి ఏటా వర్షాకాలంలో పట్టణంలోని బైపాస్‌కాలనీ, బిఎన్‌బిరావు క్వార్టర్స్, శత్రుచర్ల కాలనీలకు చెందిన ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అలాగే పుట్టూరు, లచ్చిరాజుపేట మధ్యగా ప్రవహించే సాకిగెడ్డ వరదనీరు భారీ ఎత్తున ప్రధాన రహదారిపై ప్రవహించడంతో గంటల కొద్దీ రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, పంటపొలాలు నీటమునిగి రైతులకు కంటనీరు



కాలువకు అడ్డంగా పేరుకుపోయిన పాలిథీన్ సంచులు, చెత్త



ముంపునకు గురరై జలదిగ్బంధంలో ఉన్న బైపాస్ కాలనీ (ఫైల్)

పెట్టిస్తున్నాయి. ఏళ్లతరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నప్పటికీ పట్టించే నాథుడే లేడు. ఈనెల 6న రికార్డు స్థాయిలో 84 మిల్లిమీటర్ల వర్షానికి సాకిగెడ్డతో పాటు, వరహాల గెడ్డ ఉధృతంగా పొంగి, తమ ప్రతాపాన్ని చూపించాయి. ఎప్పటిలాగే పుట్టూరు పరిసర ప్రాంతాల్లో పంటలు నీటిలో మునిగిపోగా, రాత్రంతాగా రహదారిపై నీరుచేరి 45 గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరహాలు గెడ్డ పొంగి జనశక్తి కాలనీ, రాజీవ్‌కాలనీ, బైపాస్‌కాలనీ, సౌందర్య దియేటర్ రహదారి, శత్రుచర్ల కాలనీ, పట్టణ శివారు గెడ్డవీధితో పాటు పలు ప్రాంతాలు నీటమునిగాయి. ఆ సమయంలో అధికారులు, పాలకులు వరదనివారణ చర్యలు చేపట్టి బాధితులను ఆదుకున్నప్పటికీ ఇది కేవలం తాత్కాలిక ఉపశమనమేనని ఆయా ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ప్రతిఏటా చేదు అనుభవాన్ని మిగులుస్తున్న సాకిగెడ్డ, వరహాలగెడ్డ పరివాహక ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ముంపు బారి నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు. అంతేకాక ఈరెండు గెడ్డలు పూర్తిగా పూడికలతో నిండిపోవడమే కాకుండా, ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురికావడంతో ప్రవాహం ధాటిపెరిగి పరిసర ప్రాంతాల్లోకి వరదనీరు చొచ్చుకు వచ్చేస్తుంది. కావున వర్షాకాలానికి ముందుగానే పూడికలు తీయించడం, సాకిగెడ్డ డిజైన్‌మార్చి ఎత్తును పెంచి, కొత్తగా నిర్మాణం చేపట్టడంతో పాటు, వృథాగా పోతున్న వరదనీటిని నిల్వచేయడంకానీ, జంఝావతి కాలువకు మళ్లించి, రైతులకు ఉపయోగకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అటు పట్టణ, మండల ప్రజలు కోరుతున్నారు.



కలెక్టరేట్ వద్ద 'వేడుకోలు' దీక్ష చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నాయకులు

సమస్యల పరిష్కారం కోరుతూ

కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు 'వేడుకోలు'

ప్రజాశక్తి - కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు "వేడుకోలు"దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, నాయకులు బి.ఈశ్వరరావు, కె.నరసింహాచారి, శ్రీరాములు తదితరులు మాట్లాడుతూ సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న అన్ని రకాల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన అప్పటి ప్రతిపక్ష నాయకుడు ప్రస్తుత ముఖ్యమంత్రి సర్వశిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 15శాతం జీతాలు పెంచినప్పటికీ సర్వ శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచకపోవడం సమంజసం కాదన్నారు. సుప్రీంకోర్టు సూచన ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వ శిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ఈ విభాగంలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన విధానం కాదన్నారు. నిర్దిష్ట కాలం ప్రాతిపదికన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు, రిటైర్ అయిన సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు రూ.20 లక్షలు గ్రాడ్యుటీ చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఎ, డిఎ, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. తమను రెగ్యులర్ చేసే వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఇప్పటికే అనేక దశల్లో ఆందోళన చేపట్టామని, అయినా ప్రభుత్వంలో స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి ఉద్యోగుల గోడు తెలియజేయడం కోసం ఈ దీక్ష చేపట్టామని తెలిపారు, ఈ "వేడుకోలు" దీక్షలో సర్వ శిక్ష అభియాన్ జెఎసి నాయకులు ఎం.శాంతలక్ష్మి, ఎం.హైమావతి, ఇ.జ్యోతి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నాయకుల గృహనిర్బంధాలు



పార్వతీపురం : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పలుచోట్ల నిరసనలు, అరెస్టులు

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో రెండోరోజు ఆదివారం కూడా జిల్లాలో టిడిపి నాయకుల అరెస్టులు, గృహనిర్బంధాలు కొనసాగాయి. జిల్లాలో పలుచోట్ల ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అరెస్టయ్యారు. ఇదిలా ఉండగా చంద్రబాబును రిమాండ్‌కు తరలించడంతో ముందస్తుగా ఎక్కడికక్కడ భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. చంద్రబాబుకు రిమాండ్ విధించడంతో టిడిపి శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది.

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

చంద్రబాబునాయుడు అరెస్టు సందర్భంగా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్రను వారి వారి ఇళ్లల్లోనే నిర్బంధించారు. రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమవుతున్న కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పార్వతీపురం వైకెఎం కాలనీలో ఉన్న టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనేల్ విజయచంద్ర ఇంటి ప్రాంగణంలో మండల, పట్టణ ప్రాంతాలకు చెందిన అభిమానులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించి శాంతియుతంగా కొనసాగించారు.

కురుపాం : చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆదివారం తెలుగు తమ్ముళ్లు నిరసన చేపట్టారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తామంటే అనుమతి లేకుండా పోలీసులు తమను ఇంటి నుండి బయటకు రాకుండా చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కిమిడి రామరాజు, నందివాడ కృష్ణబాబు, అంబటి రాంబాబు, శేఖర్ పాత్రుడు, విశ్వనాథం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చంద్రబాబు నాయుడు ను రిమాండ్ కు తరలిస్తున్న నేపథ్యంలో కురుపాం లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన బందోబస్తు చేపట్టారు..

భూదేవి దీక్ష భగ్నం

సీతంపేట : చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి నాయకులు పడాల భూదేవి నిరసన చేపట్టారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్ నోటికి కట్టి మౌన దీక్ష చేపట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దీక్షను భగ్నం చేసి అదుపులోకి తీసుకున్నారు. భూదేవికి మద్దతుగా వచ్చిన టిడిపి నాయకులు బిడ్డిక జయలక్ష్మి, కుండంగి తేజోవతి, సవర మంగయ్య, సవర శిమ్మయ్యను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఇంటి వద్ద జగదీశ్వరి నిరసన దీక్ష

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరిని ఎల్విన్ పేట పోలీసులు గృహనిర్బంధం చేశారు. దీంతో ఆమె ఆ పార్టీ నాయకులతో కలిసి ఇంటి వద్ద నిరసన దీక్ష చేపట్టారు. జనసేన మండల అధ్యక్షులు కద్రక మల్లేశ్వరరావు సంఘీభావం తెలిపారు. మరోవైపు గృహనిర్బంధంలో ఉన్న రెండో వర్గానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతికి జన సైనికులు సంఘీభావం తెలిపారు.

వీరఘట్టం : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ స్వగ్రామైన ఎం.రాజపురంలో ఆదివారం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, నియోజకవర్గ యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, బి.హరిబాబు, యామక అప్పలనాయుడు, ఎన్.శశికుమార్, సిహెచ్.ఉమామహేశ్వరరావు, జగదీష్, కె.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ముందస్తుగా ఆదివారం ఎస్‌ఐ ఎం.వెంకటరమణ, సిబ్బంది ఎం.రాజపురం గ్రామానికి చేరుకొని జయకృష్ణను గృహ నిర్బంధం చేశారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల యువత అధ్యక్షులు మాచర్ల అనిల్, బల్ల హరిబాబు, ఎన్ శశి కుమార్, సిహెచ్ ఉమామహేశ్వరరావు, యామక అప్పలనాయుడు , కె.ధర్మారావు తదితరలను హౌస్ అరెస్టు చేశారు.

సాలూరు: చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక టిడిపి నాయకుల నివాసాల్లో వేర్వేరుగా దీక్షలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ నివాసంలో ఆయన అనుచరులు దీక్ష చేపట్టారు. ఈ దీక్ష లో సాలూరు మండల పార్టీ అధ్యక్షులు ఎ.పరమేష్, మాజీ అధ్యక్షులు చోడవరపు గోవింద రావు, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ పప్పల మోహన్ రావు, మండల సీనియర్ నాయకులు మత్స శ్యాం సుందర్ పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి తన నివాసంలో అనుచరులతో దీక్ష నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహారదీక్షలు చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఆమె నివాసంలో దీక్ష చేపట్టారు.




కురుపాం వీధుల్లో రాత్రి పహరా కాస్తున్న పోలీసులు



గుమ్మలక్ష్మీపురంలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు



సీతంపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



సాలూరులో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

అంబేద్కర్ విగ్రహం వద్ద ఒంటికాళ్లతో జనసేన నిరసన

గుమ్మలక్ష్మీపురం : శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వమే రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుందని జనసేన మండల అధ్యక్షులు కద్రకమల్లేశ్వరరావు అన్నారు. ఎల్విన్‌పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన కార్యకర్తలు కళ్లకు నల్లబ్యాడ్జీలతో ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని వైసిపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ప్రజల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌కు రావడానికి పాస్‌పోర్టు అవసరమా అని ప్రశ్నించారు. ఆయన్ను పోలీసులు అడ్డుకోవడం సమర్థనీయం కాదని దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అధికారి అనిల్, యువరాజ్, భవానీ శివ తదితరులు పాల్గొన్నారు.




మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

ఏరియా ఆస్పత్రి బాస్ ఎవరో?

- అనారోగ్యంతో తప్పకున్న డాక్టర్ వేణుగోపాల్
- జూనియర్ డాక్టర్ మీనాక్షికి ఇన్‌ఛార్జి బాధ్యతలు
- సీనియర్ ఎవరో తేల్చాలని డిప్యూటీ సిఎం లేఖ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పోస్ట్ కోసం తెరవెనుక పైరవీలు మొదలయ్యాయి. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏరియా ఆసుపత్రిగా మార్చడంతో పాటు వందపడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేశారు. దీంతో ఆసుపత్రి బాస్ పదవి కోసం పోటీ పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో ఐదుగురు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌లు పని చేస్తున్నారు. వీరిందరికన్నా సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ అయిన డాక్టర్ ఎం.వేణుగోపాల్ మొన్నటి వరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పని చేశారు. పని ఒత్తిడి, అనారోగ్యం కారణంగా ఆయన సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన తర్వాత సీనియర్ అయిన డాక్టర్ ఎ.రత్నకుమారి ఇప్పుడు ఇంఛార్జి సూపరింటెండెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే ఇదే ఆసుపత్రి లో పని చేస్తున్న డాక్టర్ వి ఆర్ మీనాక్షిని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ సిఎం రాజన్నదొర కొనసాగుతున్నారు. వాస్తవంగా చూస్తే ఆసుపత్రి లో పని చేస్తున్న ఐదుగురు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌ల్లో డాక్టర్ మీనాక్షి ఆఖరులో ఉన్నారు. డాక్టర్ వేణుగోపాల్ తర్వాత సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా డాక్టర్ రత్నకుమారి ఉన్నారు. ఆమెను కాదని జూనియర్ అయిన డాక్టర్ మీనాక్షిని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.డాక్టర్ మీనాక్షి కన్నా ముగ్గురు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌లు సీనియర్లుగా ఉన్నారు. వారందర్నీ పక్కన పెట్టి డాక్టర్ మీనాక్షికి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమించడాన్ని సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ లు అసంతృప్తితో ఉన్నారు. సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌ల జాబితా కూడా రాజన్నదొరకు చేరింది. జూనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ స్పెషలిస్ట్‌గా డాక్టర్ మీనాక్షిని సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు చేయడంపై రాజన్నదొర ఆగ్రహంతో ఉన్నారు.



OFFICE OF THE DIRECTOR OF SECONDARY HEALTH
GOVERNMENT OF ANDHRA PRADESH: VIJAYAWADA

Memo.No.DSH-12025/41/2023-Medical Dt:05/09/2023

Sub: -	DSH- Medical Section- Incharge arrangements to the post of Area Hospital, Salur, Vizianagaram District(erstwhile)- Certain directions-issued-regarding.
Ref: -	1. G.O.Ms.No.48, Health, Medical and Family Welfare Department (C1) Dept dated: 29.01.2000. 2. Andhra Pradesh Ordinance No.7 OF 2023. 3.Representation of Dr.V.R.Meenakshi, CSS, AH Salur, Vizianagaram District(erstwhile).

****

Considering the circumstances , explained vide the reference 3rd cited, the DCHS, Vizianagaram District(erstwhile) is instructed to place Dr.M. Venugopal, CSSGY, the senior among all the CSSs in the hospital as Medical Superintendent, AH, Salur and if he is not willing, then place Dr. V.R. Meenakshi CSSGY, the next senior, as the Medical Superintendent of the hospital immediately as per the rules in vogue.

The Officers marked the address entries are instructed to implement the orders and report compliance.

This has got the approval of the Director of Secondary Health, Andhra Pradesh , Vijayawada.

మినాక్షికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు

వైద్య, ఆరోగ్య మంత్రి కి లేఖ రాస్తా
డిప్యూటీ సీఎం రాజన్నదొర

ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నియామకం విషయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు జారీ ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు నా దృష్టి కి వచ్చింది. డాక్టర్ వేణుగోపాల్ అనారోగ్యం కారణంగా సూపరింటెండెంట్ బాధ్యతలు నిర్వహించేందుకు అయిష్టత వ్యక్తం చేశారు .అయితే ఆయన తర్వాత సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌లు ముగ్గురు ఉన్నారు. వారిని కాదని జూనియర్ అయిన డాక్టర్ మీనాక్షిని ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు రావడం ఆశ్చర్యంగా ఉంది. ఆసుపత్రి కమిటీ చైర్మన్‌గా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనికి, ఆశాఖ ఉన్నతాధికారులకు సీనియర్ ఎవరో తేల్చాలని కోరుతూ లేఖ రాస్తాను.

చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య కాదు

డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతిపక్ష పార్టీ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు కక్ష సాధింపు చర్య కాదని, పక్కా ఆధారాలతోనే సిఐడి అరెస్టు చేసిందని డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని కొటికిపెంటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష టిడిపి నాయకులు కావాలనే ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై బురదజల్లే ప్రయత్నం ఆరోపించారు. 2017 నుంచి సుమారు ఆరు స్వయం ప్రతిపత్తి కలిగిన దర్యాప్తు సంస్థలు, దర్యాప్తు నిర్వహించి రూ.240 కోట్లు అవినీతి జరిగినట్లు నిర్ధారించి చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఈ స్కాంలో చంద్రబాబు ప్రమేయం లేకపోతే సిఐడి అడిగిన ప్రశ్నలకు తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాను, అనే సమాధానాలు ఎందుకు చెబుతారని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తిని అరెస్టు చేసేటప్పుడు బలమైన ఆధారాలు లేకుండా సిఐడి అరెస్టు చేయదు కదా అన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించి, సానుభూతి పొందేందుకు టిడిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, జిల్లా కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, స్థానిక సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, స్టేట్ బీసీ సెల్ కార్యదర్శి సలాది అప్పలనాయుడు, మండల యువజన విభాగమ అధ్యక్షులు శనాపతి నారాయణరావుపలువురు సర్పంచులు ఉన్నారు.



గ్రంథాలయంలో ఆడుతున్న, చదువుతున్న చిన్నారులు

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆవరణంలో వచ్చిన పిల్లలతో నీతి కథలు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందేందుకు పిల్లలతో ఆటలు, పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు శాఖ గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్‌రావు తెలిపారు. ఈయన పిల్లలతో మాట్లాడుతూ సంపదలు అన్నిటికంటే చదువు ఉన్నతమైనదని తెలిపారు. అందుకు విద్యార్థులు తప్పక చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు. ఇంటిలో ఖాళీ సమయాలలో సెల్ ఫోన్ కు సమయము ఇవ్వకుండా పుస్తకాలు పట్టుకోవాలని స్కూల్లో ఇచ్చినటువంటి హెూం వర్క్ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు.

ఏనుగుల కదలికపై ప్రజలకు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏనుగుల కదలికపై ప్రజలకు అటవీశాఖ అధికారులు సమాచారం ఇవ్వాలని అవి సంచరిస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కురుపాం సమీపంలో ఉన్న హరి అనే ఏనుగు కదలిక, గిరి శిఖర గ్రామమైన జరడలో సంచరిస్తున్న నాలుగు ఏనుగుల గుంపు కదలికలపై గిరిజన గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. ఎందుకంటే తాము కొండల్లో పోడు వ్యవసాయం చేస్తూ అడవుల్లో పండేటువంటి పంటలను నమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటామని, కావున మేము ఎక్కువగా అడవులకు వెళ్తుంటామని ఏ క్షణాన ఏమి జరుగుతుందో ఏనుగులు ఎక్కడుంటాయో తెలియదని తెలిపారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కు బిక్కు మంటూ అడవులకు వెళ్తున్నామన్నారు. కావున అటవీశాఖ అధికారులు ఏనుగుల కదలికలపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు

మురుగు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - కురుపాం

తోటపల్లి నుండి కురుపాం వరకు రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో కాలువల్లో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు చేరి ప్రధాన రహదారి వద్ద ప్రవహిస్తుంది. దీంతో మెయిన్ రోడ్డు, జిసిసి కాలనీవాసులు దుర్వాసనను భరించలేక కొద్ది రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంలో ఆదివారం స్థానిక ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ కాలువలో చెత్తాచెదారంతో అడ్డంగా నిలిచిపోయిన చెత్తను తీయించి కాలువ ద్వారా మురుగునీరు పంపించడం ద్వారా దుర్వాసన నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటకలు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకులు జిల్లా నలుమూలల నిండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు సరదాగా నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఆకాశంలో ఉయ్యాల ఊగారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. మరికొంతమంది గైరో ఎక్కి గుండ్రంగా తిరిగారు. ఆనంద విహార్ వద్ద డాన్సులు చేసి కేరింతర కొట్టారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

వరదనీటితో రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి-పాతబొబ్బిలి టిబిఆర్ రహదారిపైకి వరదనీరు రావడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పంట పొలాల్లో చేరుతున్న వరదనీరు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఏటా వరదనీరు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి కాలువలు ఆక్రమణకు గురికావడం వల్లనే రోడ్డుపైకి వరదనీరు వస్తుందని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వరదనీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు

బొబ్బిలిలో వర్షం

బొబ్బిలి: బొబ్బిలి, పరిసర ప్రాంతంలో ఆదివారం వర్షం కురవడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. వర్షం ఖరీఫ్ పంటలకు బాగా అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సరిపడా వర్షాలు కురవకపోవడంతో వర్షాధారంగా సాగు చేస్తున్న పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ జీతాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు డిమాండ్ చేశారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.శ్యామ్ మాట్లాడుతూ బోధనేతర పనులతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దన్నారు. జిఒ 117ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ వి.గోవిందరావు, జిల్లా నాయకులు సిహెచ్.సూరిబాబు, స్వామి, మురళి, రవి, రాంబాబు పాల్గొన్నారు.

కమిషనర్‌కు కలిసొచ్చిన పాలకవర్గ విభేధాలు

- సులువుగా కొనసాగిన కలెక్షన్ బాగోతం
- ఏడాదిలో రూ.రెండు కోట్ల పై మాటే!

ప్రజాశక్తి - సాలూరు

'రౌతు కొద్దీ గుర్రం' అన్న సామెత అక్షరాలా స్థానిక మున్సిపాలిటీకి సరిపోతుంది. ఎందుకుంటే ఇటీవల జరిగిన ఎసిబి వలలో చిక్కి సస్పెండైన కమిషనర్ హెచ్.శంకరరావు అవినీతి బాగోతానికి ఇక్కడి రాజకీయ పరిస్థితులు బాగా అనుకూలించాయనే చెప్పవచ్చు. ఆయన ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర దాటిపోయింది. మొదటి ఆరునెలలు పరిస్థితులను ఆకలింపు చేసుకోడానికి సరిపోయింది. మున్సిపాలిటీ పరిస్థితి, పాలకవర్గంలో గ్రూపు రాజకీయాలు, చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడడం వంటి పరిణామాలు ఆయన విచ్చలవిడి తనానికి దోహదపడ్డాయి. చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె భర్త మున్సిపాలిటీ పాలనా వ్యవహారాలను చూసుకునేవారు. మహిళా చైర్‌పర్సన్ ఉన్న చోటల్లా వారి భర్తో, సమీప బంధువో ఎవరో ఒకరు ఆమె పేరుతో పాలనా పగ్గాలు నిర్వహిస్తుంటారు. చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ భర్త ఆరోగ్యంగా ఉన్నంతకాలం కమిషనర్ శంకరరావు తన పరిధికి లోబడి వ్యవహరించారు. ఆయన తీవ్ర అనారోగ్యానికి గురైన తర్వాత చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ మున్సిపాలిటీపై దృష్టి సారించలేకపోయారు. కుమారుడు శ్రీనివాస్ భరత్ ఉన్నా ఆయన్ను నడిపించే నాధుడు కరువయ్యారు. చైర్‌పర్సన్ తర్వాత స్థానంలో ఉన్న వైస్‌చైర్మన్ల మధ్య కొంత కాలం వరకు సమన్వయం కొనసాగింది. వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు ఒకే గ్రూపులో ఉండేవారు. పట్టణ వైసిపి అధ్యక్షునిగా వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఎన్నికైన తర్వాత గ్రూపు రాజకీయాలు ముదిరి పాకాన పడ్డాయి. ఈ పరిస్థితులన్నీ కమిషనర్ శంకరరావుకు బాగా అనుకూలించాయనే వాదనలు వినిపిస్తున్నాయి. చైర్‌పర్సన్ పాలనపై దృష్టి సారించలేని పరిస్థితి, వైస్ చైర్మన్ల మధ్య విబేధాలు వెరసి కమిషనర్ శంకరరావు కలెక్షన్ పర్వానికి దారి చూపించాయి. కమిషనర్ శంకరరావు సీనియర్ అధికారి కావడంతో స్థానిక రాజకీయ పరిస్థితులను ఆకలింపు చేసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కలెక్షన్ బాగోతానికి తెరలేపారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షాపింగ్ సముదాయాలు, ఇంటి నిర్మాణానికి మున్సిపల్ ఆమోదం కోసం దరఖాస్తు చేసి గ్రూపు హౌస్, అపార్ట్ మెంట్ నిర్మాణంలో నిబంధనలకు నీళ్ళొదలడం, వివాదాస్పద స్థలాలకు పన్ను విధించడం వంటి అంశాలను ఆయన సొమ్ము చేసుకునే ప్రయత్నం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. చైర్‌పర్సన్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఈ అంశాలపై దృష్టి సారించి వుంటే అధికారిగా కమిషనర్ జోక్యం చాలా పరిమితంగా వుండేది. ఆ పరిస్థితి లేకపోవడంతో ఆయన తెరచాటు వ్యవహారాలకు శ్రీకారం చుట్టారనే చర్చ జరుగుతోంది. గతంలో బొబ్బిలి కమిషనర్‌గా పని చేసినప్పుడు కూడా ఆయన అవినీతి నిరోధక శాఖ కేసు ఎదుర్కొన్నారు. లెక్కకు మించిన ఆస్తుల కేసులో ఆయన కొంతకాలం సస్పెండయ్యారు. ఆ కేసు నడుస్తుండగానే జంకకుండా ఇక్కడ కలెక్షన్ పర్వానికి తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా వున్న ఓ వ్యాపారి భవనానికి పన్ను వేయడానికి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. అడ్వాన్స్‌గా రూ.50వేలు తీసుకుని మిగిలిన మొత్తాన్ని తీసుకోడానికి ముహూర్తం నిర్ణయించారు. అనుకున్న సమయానికి లక్షా యాభై వేల రూపాయలు కమిషనర్ చాంబర్లోనే అందుకున్నారు. తీసుకున్న డబ్బులు తనకొక్కడికే కాదని, అందరికీ పంచాల్సి వుందనీ ఆయన లంచం ఇచ్చిన వ్యక్తితో చెప్పినట్లు చర్చ నడుస్తోంది. మున్సిపాలిటీ పరిస్థితి అనుకూలంగా వుందనే అదును చూసుకుని ఆయన పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగాలపై దష్టి సారించారు. ఈ విధంగా ఆయన ఏడాది న్నర లోపే సుమారు రెండు కోట్ల రూపాయల వరకు కూడబెట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇది గ్రేడ్ -2 మున్సిపాలిటీ అయినా, నిర్మాణ రంగం అభివృద్ధి పెద్దగా లేకపోయినా ఆదాయ మార్గాలను గుర్తించి వనరులుగా మలచుకున్నట్లు తెలుస్తోంది. ఏమైనా వేటగాడు మెత్తన యితే గుర్రం ఎన్ని గంతులైనా వస్తుందనే సామెత ఈ మున్సిపాలిటీ పరిస్థితికి అద్దంలా ఉంది.

నాయకుల స్వార్థం... కార్యకర్తల్లో నిస్తేజం

- గ్రూపు రాజకీయాలే కారణమా?
- మండలంలోని వైసిపికి తగ్గుతున్న ఆదరణ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి బలోపేతంగా ఉండేది. ఆ తర్వాత జరిగిన ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచ్ ఎన్నికల అనంతరం గ్రూపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ప్రజా సమస్యలను గాలికొదిలేసి వైసిపిలో ఒకరి మీద ఒకరు తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ఫిర్యాదులకే పరిమితమయ్యారు. ఎంపిపి, జెడ్‌పిటిసి, పార్టీ మండల కన్వీనర్, సీనియర్ నాయకులు స్థాయిలో ఉన్న వ్యక్తులు కూడా కేవలం పదవులకు మాత్రమే పరిమితమయ్యారు తప్ప ప్రజలను, కార్యకర్తలను పట్టించుకొనే పరిస్థితి లేదు. వారి వ్యక్తిగత స్వార్థం కోసమే పార్టీని ఉపయోగించుకుంటున్నారని స్థానిక వైసిపి కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నారు. దీంతో నాయకత్వం లోపంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కార్యకర్తలు వెనుకంజ వేస్తున్నారు. మండల బాడీ ఏర్పడిన నుంచి ఎవరికి నచ్చినట్టు వారు కోటకు వెళ్లి తమ పనులు చేయించుకునే పరిస్థితి ఏర్పడింది. అప్పట్నుంచి వైసిపి కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ ఉద్యోగ అవకాశాలు వచ్చినా వైసిపి నాయకులు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కాకుండా వ్యక్తిగతంగా అవసరమైన వారికి, ఇతరులకు ముడుపులు తీసుకుని అవకాశాలు కల్పిస్తున్నరని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా ఇతరులకు కట్టపెట్టడంతో మరింత చర్చ రచ్చకెక్కుతుంది. ఎంపిపి, జెడ్‌పిటిసిలు మహిళలు కావడంతో వారి భర్తల హవే కొనసాగిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో పార్టీ ప్రధాన కేడర్ అంత గ్రూపులుగా విడిపోయి వ్యక్తిగత దూషణలు చేసుకునే వరకు వెళ్లడంతో వైసిపి నాయకత్వంలో తీవ్ర చర్చ జరుగుతుంది. వాలంటీర్ పోస్ట్ నుంచి సొసైటీ, వైఎస్ఆర్ క్రాంతి పథకం తో పాటు వివిధ కార్యాలయాలు, అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు తదితర పోస్టులకు ముడుపులు తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఇటీవల గంగరేగువలస గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వాలంటీర్ పోస్టుకు వైసిపి కార్యకర్తలు దరఖాస్తు చేసుకోగా, వారికి కాకుండా టిడిపి కార్యకర్తకు వాలంటీర్ పోస్ట్ ఇచ్చేందుకు మండల వైసీపీ నాయకత్వం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి ప్రత్యేక దృష్టి పెట్టి పార్టీ కోసం కష్టపడిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తేల్చి చెప్పడంతో చేసేది లేక నాయకులు గమ్మున ఉండిపోయారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమ వద్ద నుంచి కూడా ముడుపులు తీసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. నాయకుల తీరుపై కార్యకర్తలు కోట వద్దకు వెళ్లి తమ గోడును ఎప్పటికప్పుడు విన్నవించుకుంటున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కార్యకర్తలు కష్టపడి పని చేస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నాయకులు గ్రూపులుగా విడిపోవడంతో వైసిపి నాయకత్వంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో వైసిపి నాయకుల్లో గందరగోళ పరిస్థితి స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి దష్టిలో ఉన్నప్పటికీ ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేయడంపై పూర్తిగా మండలంపై ఎమ్మెల్యే దృష్టి సారించే పరిస్థితి కనిపించలేదు. ఏదేమైనా నాయకత్వం లోపంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపికి ఓటు బ్యాంకు తగ్గే అవకాశం ఉందని మండల ప్రజల నుంచి ఆరోపణ వస్తున్నాయి .

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆంధ్ర ఇవాంజిలికల్ లూదరన్ చర్చ్ (ఎఇఎల్‌సి) (ఎపి, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, అండమాన్ దీవుల) అధినేత మోడరేట్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ కె పరదేసిబాబు పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన అధికార పర్యటనలో భాగంగా పార్వతీపురం నుంచి తిరుగు ప్రయాణంలో బొబ్బిలిలో ఉన్న సైంట్ ఆండ్రూస్ లూదరన్ చర్చ్ సందర్శనలో భాగంగా డెలిగెట్ జెసి రాజు గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మోడరేట్ బిషప్ పరదేశబాబు బొబ్బిలి ప్రాంతంలో జరుగుతున్న పరిచర్యను, సంఘ అభివృద్ధిని, బోధకుల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చర్చ్ డెలిగేట్ జెసి రాజు ఆయనను పట్టు కండువాలతో ఘనం గా సత్కరించారు.

సెక్షన్ 30 అమలు

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రస్తుత పరిస్థితి దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఈనెల 30వ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్టివ్ అమల్లో ఉందని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. కావున అన్ని రాజకీయ పార్టీలు, ఇతర సంఘాలు ఆందోళన చేపట్టకూడదన్నారు.


మిషన్ ఇంద్ర ధనుష్‌ను విజయవంతం చేయాలి

డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు

ప్రజాశక్తి - బెలగాం



మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. సోమవారం నుండి శనివారం వరకు జిల్లా వ్యాప్తంగా జరగబోయే మిషన్ ఇంద్ర ధనుష్ రెండో దశ టీకా కార్యక్రమానికి సంబందించిన ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వైద్య సిబ్బంది వేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా షెడ్యూల్ ప్రకారం గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా వేయబడని పిల్లలను సర్వేలో గుర్తించి ప్రస్తుత కార్యక్రమంలో టీకా పూర్తి చేస్తారన్నారు. వీరితో పాటుగా ఈ వారం షెడ్యూలు ప్రకారం టీకా అర్హులు కూడా ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఉన్న 37 పిహెచ్‌సిలు, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 560 టీకా కేంద్రాల్లో 1332 మంది పిల్లలకు, 339 మంది గర్భిణీలకు టీకా వేయనున్నట్టు తెలిపారు. టీకా పూర్తి చేసిన వివరాలన్నీ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో ఆన్లైన్ నమోదు చేస్తారని, ఈ విధానం ద్వారా సచివాలయం పరిధిలోనే టీకా ధ్రువ పత్రాన్ని పొందే వీలుంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే మొదట దశ ఆగస్టులో పూర్తయ్యిందని, ప్రస్తుతం రెండో దశ అని, అక్టోబర్‌లో మూడో దశ ఉంటుందని జగన్మోహనరావు తెలిపారు. టీకా నిర్వహణను బలోపేతం చేసే దిశగా, తట్టు, రుబెల్లా తదితర వ్యాధుల పూర్తి స్థాయి నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ ఇంద్ర ధనుష్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



వాసుదేవరావును సన్మానిస్తున్న గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయునికి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పాత ఘనసరలో స్థానిక ఎంపిపి స్కూల్‌లో పదేళ్లుగా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు వెంగళి వాసుదేవరావుకు ఆదివారం ఘనసర పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ కిల్లారి పాల్గుణరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, ఉపాధ్యాయులు వాసు దేవరావుకు శాలువతో సత్కరించి, సన్మానించారు. సర్పంచ్ ఆనందరావు మాట్లాడుతూ స్థానిక గ్రామస్తులతో మమేకమై, తమ గ్రామ పిల్లలకు క్రమశిక్షణ కూడిన విద్యను అందించారని, మీరు పిల్లలకు నేర్పిన ప్రాథమిక విద్య మిమ్మల్ని జీవితాంతం గుర్తించేలా చేస్తుందని, మీ సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు అప్పారావు, గ్రామస్తులు, పిల్లలు ఉన్నారు.

శిథిల భవనాల్లో తరగతులు

భయభ్రాంతులకు గురవుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకల్లా, పెద్దూరు, సందిమానుగూడ, జె.గోపాలపురం గ్రామాల్లో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలతో పాటు రేగులపాడు, బొడ్లపాడు, చిట్టపూడి వలస, తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నారు. దీంతో ఏక్షంలో ఇవి కూలి తమ పిల్లలు ప్రమాదాలకు గురవుతారేమోనని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ భవనాలు శిథిల వ్యవస్థకు చేరుకోవడంతో వర్షం నీరు స్లాబ్‌పై నుండి కిందకి జారడంతో పాటు గోడలు బీటలు వారుతున్నాయి. పాపంపేట మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల శిథిలావ్యవస్థకు చేరుకోవడంతో ఎవరూ లేని సమయంలో పాఠశాల వెనుక గోడ కూలిపోయింది. ప్రస్తుతం పాఠశాల నిర్వహణ ఓ అద్దె గదిలో నిర్వహిస్తున్నారు. మండలంలోని ఎం.రాజపురంలో పాఠశాల ఆవరణలో అంగన్వాడి కేంద్రం వస్తున్న నిర్వహిస్తున్న భవనం కూలి పోయింది. ఆ సమయంలో పిల్లలెవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బొడ్లపాడు, రేగులపాడు, చిట్టపూడివలస, పాపంపేట అంగన్వాడి కేంద్రాల భవనాలు స్లాబ్ రాడ్లు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపు నీరు కిందకు పడడంతో అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు కూర్చొనేందుకు ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిట్టిపూడి వలస అంగన్వాడి కేంద్రంలో పెచ్చులూడుతున్న శ్లాబ్

లేబర్ కోడ్లు రద్దుచేయాలి

సిఐటియు విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి-రామభద్రపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక శ్రీవెంకటేశ్వర కళాశాల ప్రాంగణంలో సిఐటియు విస్తృత స్థాయి సమావేశాన్ని మండల కార్యదర్శి బలసా శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులపై తీవ్రమైన భారాలను మోపుతుం దన్నారు. కంపెనీలో సంఘం పెట్టుకొనే అవకాశం లేకుండా, కార్మిక సమస్యలపై పోరాటాలు చేయకుండా కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలను మర్చిపోయారని ఎద్దేవా చేశారు. కార్మికులకు నష్టం చేకూర్చే విధానా లను తీసుకొస్తే భవిష్యత్తులో అదే కార్మికులు ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్మికులకు అండగా సిఐటియు పోరాటం సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాలం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

వైష్ణవ్ ఐ కేర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వెంకటరామ ఆస్పత్రిలో ఆదివారం వైష్ణవ్ ఐ కేర్ సెంటర్‌ను ఆ ఆస్పత్రి అధినేత డాక్టర్ చిట్టి రమణారావు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐ కేర్ సెంటర్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ నేత్ర వైద్యులతో, అతి తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమణారావు భార్య చిట్టి లలిత, కుమార్తె చార్వీ, ఇతర కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఐకేర్‌ను ప్రారంభిస్తున్న చిట్టిరమణారావు కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

21 నుంచి స్వర్ణోత్సవ ప్రచారయాత్ర

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 21 నుంచి చేపట్టే స్వర్ణోత్సవ ప్రచార యాత్రను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్‌చంద్ర పట్నాయక్ అధ్యక్షతన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణోత్సవ ప్రచారయాత్రను ఈ నెల 21 నుంచి 29 వరకు ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 22న బొబ్బిలి, గజపతినగరం, విజయనగరంలో, 23న కొత్తవలసలో పతాక ఆవిష్కరణ, సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ సంఘం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టి, భవిష్యత్తు కార్యక్రమాలను వెల్లడించారు. సమావేశంలో సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, జిఒ 117 రద్దు చెయ్యాలని, బోధనేతర పనులు రద్దు చేయాలని, పాఠశాలల నిర్వహణకు నిధులు కేటాయించాలని తీర్మానించారు.

అనంతరం నాయకులు భాస్కర్ ఆడిట్ రిపోర్టు ప్రవేశపెట్టారు. తొలుత ఇటీవల కాలంలో మరణించిన ఉపాధ్యాయులకు సంతాప తీర్మానాన్ని ఎ.సత్యశ్రీనివాస్ ప్రవేశపెట్టగా, సభ్యులంతా మౌనం పాటించారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, జి.పద్మావతి, జి.పార్వతి, కె.ప్రసాదరావు, ఎ.శంకరరావు, ఆర్‌ఎవి సూర్యారావు, కె.శ్రీదేవి, భవాని, పి.రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.